క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం



నూతన బోరు మోటారు వద్ద గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో నూతన విద్యుత్ మోటారు ఏర్పాటు చేయడంతో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని వీధి కుళాయిలకు నీటి సరఫరా చేసే విద్యుత్ మోటారు మరమ్మతులకు గురికావడంతో 3 రోజులుగా నీటి సమస్య ఏర్పడింది. వేసవి కావడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. సర్పంచు నాయిని సావిత్రమ్మ వెంటనే నూతన విద్యుత్ మోటారు తెప్పించి ఏర్పాటు చేయించడంతో నీటి సమస్య పరిష్కారమైంది.

నాటు సారా నిర్మూలనే ధ్యేయం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: నాటుసారా నిర్మూలనే తమ ధ్యేయమని ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం కొట్టాల చెరువు గ్రామంలో ప్రజలకు ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, నాటుసారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నాటుసారా నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసినా అలాంటి వారి వివరాలను 9440902585, 9177299067, 8223016754 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

శ్రీశైలం: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు టూ టౌన్ సీఐ చంద్రబాబు శనివారం తెలిపారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న డీపీఓ

మహానంది: డీపీఓ షేక్ జమీలుల్లా, కుటుంబ సభ్యులు శనివారం మహానందీశ్వర స్వామి, కామేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ల పరిశీలన

మహానంది: రాష్ట్ర వ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకులు హైమేశ్వర రావు తెలిపారు. తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. స్టాక్ పాయింట్ పరిశీలించిన అనంతరం ఎంఈఓ రామసుబ్బయ్య, జిల్లా ఏఎస్ఓ దస్తగిరి రెడ్డి తదితరులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

కూలీలకు గాయాలు

మహానంది: ఆంజనేయపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సుబ్బమ్మ, వెంకటపుల్లమ్మతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో కుక్క అడ్డు రావడంతో వారు ప్రయాణించే ఆటో బసాపురం రోడ్డు వద్ద బోల్తా పడింది.

వానరానికి అంత్యక్రియలు

నందికొట్కూరు: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలోని వేపచెట్టుపై వానరం శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న చౌడేశ్వరి దేవి సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హమాలీలు జగదీష్, ప్రతాప్, అరుణ్, మధు, మంజుల సహకారంతో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధి పనులు కల్పిస్తాం

వెలుగోడు: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. ఇటీవల తనతో పాటు బదిలీపై వచ్చిన ఈసీలు రాంగోపాల్, రామేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు మనోహర్, కిరణ్‌కుమార్, బీఎస్‌పీ రామోజీ నాయక్, కంప్యూటర్ ఆపరేటర్లుగా పార్వతి, రంగయ్య శనివారం విధుల్లో చేరినట్లు ఆమె తెలిపారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు.

నిందితుడికి రిమాండ్

పగిడ్యాల: తరచూ కోర్టు వాయిదాలకు గైర్హాజరై తప్పించుకు తిరుగుతున్న నిందితుడు పెద్ద ఇడ్లీ అలియాస్ ఇమ్మడి శివకు నందికొట్కూరు మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ప్రభుత్వ ఉద్యోగిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా కేసు నమోదైందన్నారు. ఈ కేసులో నిందితుడు శివ కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతూ వచ్చాడన్నారు. దీంతో మెజిస్ట్రేట్ నిందితునికి అరెస్ట్ వారెంట్ జారీ చేయగా అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చడంతో మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

స్వాతంత్య్ర సమర యోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సమసమాజ స్థాపనకు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో పలువురు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలన్నారు.



నందికొట్కూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో శనివారం మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నరేంద్రకుమార్‌లు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి కృషి చేసిన జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని కొనియాడారు. నెహ్రూనగర్, పగిడ్యాల ఎస్సీ కాలనీల్లో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయా కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- నందికొట్కూరు: స్థానిక ఏబీఎం పాలెంలోని పార్కులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ ఆధ్వర్యంలో నాయకులు కోకిల రమణారెడ్డి, అబుబక్కర్, రాజు, రవి, నాగరాజు, కిషోర్, భార్గవ్, కేశవ, సిద్ధూ, మధు, బాషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేజీ రోడ్డుపై ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే జయసూర్య, ఎమ్మార్పీస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కొత్తపల్లి: మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు జయంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్‌కు భారత రత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కె.నాగరాజు, రామకృష్ణ, బుడగ జంగాల జిల్లా నాయకులడు జమ్మన్న, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు నాగన్న తదితరులు డిమాండ్ చేశారు.
- ఆత్మకూరు: పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో శనివారం స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రాబిన్‌సన్ మాదిగ, దర్గయ్య, నాగయ్య, వెంకటరమణలు మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రాం దళితుల కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడని, జనం కోసమే ఆయన జీవితాన్ని అంకితం చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామారావు, పుల్లయ్య, బాలరాజు, మాలమహానాడు నాయకులు చింతలయ్య, కృష్ణఫర్, రవి, రాఘవేంద్ర, విజయ్, రంగస్వామి, చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.



ఆత్మకూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



సున్నిపెంట బస్టాండ్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- శ్రీశైలం: సున్నిపెంటలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ డీన్ డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ తన జీవిత కాలమంతా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం బస్టాండ్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ శ్యాంబాబు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి పిల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల నాయకులు సోమిశెట్టి మల్లికార్జున, టీయూసీఐ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఆశీర్వాదం, శ్రీ ఆది జాంబవ సమాజ సేవా సమితి వ్యవస్థాపకులు ధారివేముల శీను, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగేల్ల సురేష్, ప్రధాన కార్యదర్శి పాపయ్య, అధికార ప్రతినిధి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

నందికొట్కూరు: అతి వేగంగా ప్రాణాలకే ప్రమాదమని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. అతి వేగంతో ఆటోలు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

- శ్రీశైలం: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వన్‌టౌన్ ప్రసాద్ రావు శనివారం ఆటోడ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఫిట్‌నెస్, పొల్యూషన్ తదితర ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. టూ వీలర్స్ నడిపే వారు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్‌లో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. యాత్రికుల నుంచి సందర్శనీయ స్థలాల కోసం ఎక్కువ చార్జీలు డిమాండ్ చేయవద్దన్నారు.

నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న శిల్పి సుబ్బరాయుడు

మహానంది: దేరంగుల రాంపుల్లయ్య(వడ్డె రాంపుల్లయ్య)పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని అఖిల భారత వడ్డెర సమాజ సంఘం జాతీయ అర్గనైజింగ్ కార్యదర్శి భారత శిల్పి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఉడిపి రమణ కల్యాణ మండపంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రేమ వ్యవహారంలో అంతమొందించాలనే ఉద్దేశంతో కాళ్లు చేతులు కట్టేసి విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. ఈ ఘటనపై మహానంది పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరి 23న కేసు నమోదైనా ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. ఈ విషయంపై ఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశామని, దాడికి పాల్పడిన కరీముల్లా, ఆయన బంధువులను అరెస్ట్ చేయాలన్నారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు వడ్డె నరసింహులు, శివయ్య, కిట్టు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

పాములపాడు: శ్రీరామ నవమి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ కలిసి మెలిసి సంతోషంగా శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొనాలన్నారు. ఎలాంటి అల్లర్లకు తావివ్వరాదన్నారు. గ్రామోత్సవం సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అలజడులు సృష్టించి వేడుకలకు విఘాతం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఎంపీ రఫీక్‌అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కర్నూలు శాంతిరామ్ కంటి ఆసుపత్రి డాక్టర్లు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూటమి ప్రభుత్వంపై పోరాడుతాం

బండి ఆత్మకూరు: వలంటీర్లందరినీ ఉద్యోగాల్లోకి తీసుకునే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాడతామని వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు గోర్ల సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు రూ.10 వేల వేతనం ఇచ్చేంత ప్రభుత్వంపై పోరాడతామన్నారు.

9న అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఈనెల 9న శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ఎదురుపాడు గ్రామంలో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులను దాతల సహకారంతో అందజేస్తామన్నారు. పాల్గొనదలిచిన వారు అదే రోజు ఉదయం 6.30 గంటల్లోపు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9885036724, 9052059489, 9492403152, 9676711671 నంబర్లను సంప్రదించాలన్నారు.

పొలంలో పంట కొయ్యలు కాల్చొద్దు

వెలుగోడు: పంట కోత అనంతరం కొయ్యలను, వ్యర్థాలను పొలంలోనే కాల్చొద్దని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. శనివారం ఆయన వేల్పనూరు, అయ్యవారిపల్లి గ్రామాల పరిధిలోని పొలాలను పరిశీలించారు. వ్యర్థాలు పొలంలోనే కాల్చితే భూసారానికి, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పోషకాలు నశిస్తాయని, భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుందన్నారు. అలాగే భూమి ఉన్న ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 75 శాతం మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగతా వారు కూడా త్వరగా చేయించుకోవాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



శిల్పాకు బొకే అందిస్తున్న జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో వ్యక్తిగతంగా కలిసి పలు సమస్యలపై చర్చించారు. పార్టీ మండల, పట్టణ కమిటీలను ఎంపిక చేస్తున్నామని, కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన శిల్పా

వైఎస్సార్‌సీపీ నాయకులు, 5వ వార్డుకు చెందిన మొమిన్‌షఫీ సోదరుడి కుమారుడు సుభాని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

శిల్పాను కలిసిన జిల్లా కోఆప్షన్ సభ్యుడు

ఉమ్మడి జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఇలియాజ్‌ఖాన్ శనివారం శిల్పా చక్రపాణిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇలియాజ్‌ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడి బాధ్యతలు కట్టబెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, నాయకులు జయకృష్ణ, అంజాద్‌అలీ, సుల్తాన్, రషీద్, పాన్‌బాషా, కరిముల్లా, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాటం

నందికొట్కూరు: వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాటనికి సిద్ధం కావాలని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు కోరారు. శనివారం పట్టణంలోని సురాణి, సల్ఫియా మసీదుల వద్ద వక్ఫ్ చట్ట సవరణ కరపత్రాలను సీపీఎం నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణకు అనుకూలంగా టీడీపీ, జనసేన పార్టీలు ఓటు వేసి మైనార్టీలకు ద్రోహం చేశాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉస్మాన్‌బాషా, బాబు, ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు సలాంఖాన్, ముస్లింలు ఇబ్రహీం, సత్తార్‌ఖాన్, మగ్బూల్, వలి, రసూల్, హరీష్, ఖనా, రఫీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల అదుపులో నిందితులు

రుద్రవరం: అడవి జంతువుల మాంసం తెచ్చుకున్న విషయంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు డీఆర్వో ముర్తుజా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రమైన రుద్రవరం పరిధిలో నల్లమల అడవికి సమీపంలో బెస్త కాలనీకి చెందిన కొందరు అడవి జంతువులను వేటాడుతున్నట్లు తెలిసిందన్నారు. బెస్త కాలనీకి చెందిన మల్లేష్,సాం బశివుడు అడవి పంది మాంసం తెచ్చుకుంటుండగా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. పంట పొలాల వద్ద కుక్కలు అడవి పందిపై దాడి చేసి చంపడంతో ఆ మాంసం తెచ్చుకున్నట్లు నిందితులు చెబుతున్నారని తెలిపారు.

జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక



వీరయ్య

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభ అవార్డుకు నంద్యాలలోని గురురాజ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వీరయ్య ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ దక్షిణ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేసిన ప్రముఖులను అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డును ఆయన అందుకుంటారని చెప్పారు.

గుండెపోటుతో అంకిరెడ్డిపల్లె సర్పంచ్ మృతి



నాగన్న(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె సర్పంచ్ మాదిగ నాగన్న(55) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. రెండు నెలల క్రితం గుండె సంబంధ సమస్య రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో నాగన్న సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృతదేహానికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సర్పంచ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



చెన్నకేశవస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్న దృశ్యం

పగిడ్యాల: శ్రీరామనవమి, లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాల మహోత్సవానికి దేవదాయ శాఖ అధికారులు ఆలయాలను ముస్తాబు చేశారు. ఆదివారం స్వామి వారి కల్యాణం, సోమవారం రథోత్సవం, మంగళవారం పారువేట ఉత్సవాలతో ముగియనున్న చెన్నకేశవస్వామి తిరునాలను వైభవంగా జరిపేందుకు అధికారులు, గ్రామ కమిటీ పెద్దలు ఏర్పాట్లు చేశారు. లక్ష్మీచెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు ఊరివాకిలిని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. ఏటా శ్రీరామనవమి పర్వదినానికి నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి తిరునాలకు గాజుల అంగళ్లు, బొమ్మల అంగళ్లు, చిరు వ్యాపారాలు సాగించే పలువురు వ్యాపారులు, జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్ ఉయ్యాలల రాకతో గ్రామంలో తిరునాల వైభవం ఉట్టిపడుతోంది. పుట్టింటికి వస్తున్న ఆడపడుచులు, బంధువుల సందడితో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. వేడుకల్లో భాగంగా బండలాగుడు పోటీలు, రేలారేలా కార్యక్రమాలకు గ్రామ కమిటీ కసరత్తు చేస్తోంది. సంతమార్కెట్ ఆవరణం ఇప్పటికే వ్యాపారుల అంగళ్లతో నిండిపోగా వారికి కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పర్యవేక్షించారు.



రామాలయం వద్ద షామియానాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

పాములపాడులో..

పాములపాడు: సీతారాముల కళ్యాణ మహోత్సవానికి దేవాలయాల వద్ద ప్రజలు శనివారం ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని నిర్వహించే సీతారాముల కళ్యాణ వేడుకలకు ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం షామియానాలు, కళ్యాణ మండపాలను సిద్ధం చేసే పనిలో ఆలయ కమిటీ నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత్రి కళ్యాణ మూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: శ్రీరామనవమిని పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో మిడుతూరు మండలం మాసాపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు అట్టహాసంగా సాగాయి. పోటీలను ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. కర్నూలు మండలం బీ.తాండ్రపాడు వరలక్ష్మి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు గెలుపొందాయి. రెండో బహుమతి(రూ.30 వేలు) తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు అంజిరెడ్డి ఎద్దులు దక్కించుకున్నాయి. తృతీయ బహుమతి(రూ.25 వేలు)ని గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాపి గ్రామానికి చెందిన రక్షిత్ పటేల్, రాయపురం గ్రామ నల్లారెడ్డిల వృషభాలు కైవసం చేసుకున్నాయి. అలాగే నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదవ స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు కూడా నగదు బహుమతులు అందజేశారు.

పుణ్యక్షేత్రాలను సందర్శించుకున్న ప్రముఖులు



సంగమేశ్వర ఆలయ చరిత్రను ఆర్డీఓ దంపతులకు వివరిస్తున్న ఆలయ పురోహితుడు



కొలనుభారతి దేవి అమ్మవారికి పూజలు చేస్తున్న కాకనూరు శారదపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి



గోకవరం భక్తకన్నప్ప గురుకుల ఆవాస విద్యార్థులతో మాట్లాడుతున్న కాకనూరు పీఠాధిపతి

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలను శనివారం ప్రముఖులు సందర్శించుకున్నారు. సంగమేశ్వరం ఆలయాన్ని కర్నూలు ఆర్డీఓ మల్లికార్జున దంపతులు సందర్శించుకుని వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ వారికి ఆలయ విశిష్టత, చరిత్రను వివరించారు. కొలనుభారతి క్షేత్రాన్ని కాకనూరు శారద పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి దర్శించుకున్నారు. స్వామివారికి ఆలయ పురోహితుడు శ్రీనివాసశర్మ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి పూజలు చేసుకున్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాలను సందర్శించారు. ఆలయ విధుల కోసం అర్చకుల మధ్య గత నెల 24న జరిగిన ఘర్షణపై ఆరా తీశారు. ఆలయంలో ఎటువంటి గొడవలు, ఘర్షణలు లేకుండా విధులు చేసుకోవాలని సూచించారు. ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా అందరూ కలిసి కట్టుగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం గోకవరం భక్తకన్నప్ప గురుకుల ఆవాసాన్ని సందర్శించి విద్యార్థులను కలసి మంచి విద్యను అభ్యసించాలని సూచించారు. గిరిజన విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు.